విశాలాంధ్ర విశాఖపట్నం
మంగళవారం 8, అక్టోబర్, 2024

జెడ్పీ సీఈవోగా నారాయణమూర్తి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా పి. నారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను తన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఇప్పటి వరకు డీఎల్డీవోగా ఉన్న ఈయన కాకినాడ జడ్పీ సీఈవో (ఎఫ్.ఎ.సి.)గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పదోన్నతిపై విశాఖ జెడ్పీ సీఈవోగా విచ్చేశారు. జెడ్పీ అధికారులు, సిబ్బంది సీఈవోకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక కొరత... నిలిచిన నిర్మాణాలు

- టీడీపీ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ఇవ్వాలి

విశాలాంధ్ర - పీఎం పాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరా చేసి భవన నిర్మాణ కార్మికులను, నిర్మాణ రంగాన్ని సంక్షోభం నుండి బయటపడేయాలని భవన నిర్మాణ కార్మికులు కోరుకుంటున్నారు. విశాఖపట్నం జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, ఇసుక కొరతను నివారించాలని కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైంది. ఇసుక కొరత కారణంగా మధురవాడ ప్రాంతంలో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇసుక మాఫియా ధరలకు రెక్కలు వచ్చాయి. రెండింతలు ధరలు పెంచుతూ పేద సామాన్య ప్రజల నిర్మాణదారుల నడ్డి విరుస్తున్నారు. మరొకపక్క బిల్డర్లు నిర్మాణ రంగాన్ని ఇసుక లేక హాలిడే ప్రకటించారు. ప్రజలు కొందామంటే ఇసుక దొరకడం లేదు. ధరలు రెట్టింపు అయ్యాయి. నిర్మాణాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. విశాఖలో దాదాపు లక్ష మంది కార్మికులకు ఉపాధి పోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. నిర్మాణ రంగం మీద ఆధారపడిన ఇతర వ్యాపారాలు దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, ఇసుక అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి రాష్ట్రంలో టన్ను ఇసుక ధర 1070 రూపాయలు ఉండేది. నేడు అది 2000 నుండి 2300 అయింది. రెండున్నర యూనిట్ల ఇసుక 12000 రూపాయలు ఉండేది. నేడు 22 వేలు నుండి 24 వేలు అయింది. ఒక సిమెంట్ బస్తా ధర 370 రూపాయలు ఉంటే ఒక ఇసుక బస్తా ధర రూ.300 నుండి రూ. 400 ఉంది. ఇసుక ధర పెరుగుదల తీవ్రతకు ఇది అద్దం పడుతోందన్నారు. వరదలు వలన ఇసుకతీత నిలిచిపోయిందని ప్రభుత్వం చెబుతోంది. ఒరిస్సాలోను వరదలు వచ్చాయి. మరి ఒరిస్సా నుండి విశాఖకు ఇసుక ఎలా వస్తున్నదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక గెడ్డలు, నదులలో ఇసుక వెలికి తీత ఎందుకు నిలిపివేశారని ప్రశ్నిస్తున్నారు. ఆన్లైన్లో ప్రజలు బుకింగ్ చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఈ బుకింగ్ రాజకీయ అధికార అండతో ఇసుక మాఫియాకు అడ్డాగా మారింది. రాత్రికి రాత్రి వీరు బుకింగులు చేసేస్తున్నారు. సాధారణ మధ్యతరగతి ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండటం లేదు. జిల్లాలోని భీమిలి, అగనంపూడి ముసర్లోవ స్టాక్ యార్డులో ఇసుక లేదు. రాజమండ్రి, శ్రీకాకుళం నుండి రావలసిన ఇసుక రావడం లేదు. నిర్మాణాలు ఆగిపోయి కార్మికులతో పాటు వీరూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి ఆచరణకు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం నదులు, గెడ్డలు ఇసుక దోపిడీ చేస్తోంది. ప్రజలను దోచుకు ంటోంది. ఇసుక మాఫియా పెరిగిపోయింది. మాకు అధికారం ఇవ్వండి ఉచిత ఇసుక ఇస్తాం.. ప్రజల ఇళ్ల వద్దకే సరఫరా చేస్తాం... దళార్లు లేకుండా చేస్తాం... ఇసుక మాఫియాను భూస్థాపితం చేస్తామని ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి హామీ ఇచ్చింది. ప్రజలు నమ్మి కూటమికి బ్రహ్మరథం పట్టారు. కానీ నమ్మిన ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి ఇసుక విధానం అమలు కాలేదు. ఈ పద్ధతిని వెంటనే మార్చుకొని ఉచిత ఇసుక అమలు చేసి, ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను గత జగన్ ప్రభుత్వం నిలిపివేసి కార్మికులకు, వీరి కుటుంబాలకు అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అని సభలు పెడుతున్నారు. తను ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక ఇవ్వకుండా సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయకుండా ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అప్పన్న ఆలయంలో వైభవంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆర్జిత సేవల్లో భాగంగా నిత్య కళ్యాణం, గరుడ సేవ నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని మండపంలో అధిష్ఠింపజేశారు. పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కార్యక్రమాన్ని కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

మండల ఆర్ఐగా నేమాని

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నేమాని ఉమాదేవి బాధ్యతలు చేపట్టారు. గతంలో భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో, అంతకుముందు పద్మనాభం, విశాఖ కలెక్టరేట్‌లో పనిచేసి ఇటీవల బదిలీలో భాగంగా ఆనందపురం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఆర్ఐకు తహశీల్దార్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాలవలస పంచాయతీ కార్యదర్శిగా సౌజన్య

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని పాలవలస గ్రామపంచాయతీ కార్యదర్శిగా సౌజన్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా కే.కోటపాడు మండలం నుండి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పాలవలస పంచాయతీ నాయకులు మద్ది శేఖర్, నిమ్మల అప్పలరాజు, కే.రమేష్ టి.రాము, పి.నారాయణరావు, పలువురు నాయకులు కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన సబ్బవరపు ప్రతాప్ ఇటీవలే బదిలీల్లో భాగంగా పద్మనాభం మండలం విలాస్కాన్ పాలెంకి వెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - సాగర్ నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. మంగళ వారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఎండాడ, సుభాష్ నగర్, వరగిరి నగర్, ముబా రక్ కాలనీ, సాగర్ నగర్, దసపల్లా లేఔట్, ఐటీ పార్క్, ఎస్.ఎస్.తిమ్మా పురం, రుషికొండ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ చేసిన గంటా

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమందికి టోకెన్లు ఇస్తున్నారు, భోజనం నాణ్యత ఎలా ఉంది, ఏమైనా లోపాలున్నాయా వంటి వివరాలను నిర్వాహక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అందరితో పాటు కలిసి భోజనం చేశారు. భోజనం రుచి ఉందని, పరిసరాల పరిశుభ్రత కూడా బాగుందని గంటా పేర్కొన్నారు. భోజనం కోసం వచ్చిన వాళ్ళతో కొంతసేపు ముచ్చటించారు. అన్నా క్యాంటీన్‌లో వడ్డిస్తున్న భోజనం పట్ల వారందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్నా క్యాంటీన్‌లలో భోజనానికి ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదవాడికి రూ.5 కే కడుపు నిండా మంచి భోజనం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వారందరూ ప్రశంసించారు.

బతుకమ్మ సంబరాల్లో ఆటా...పాటా...

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఆట, పాటలతో మహిళలు సందడి చేశారు. బతుకమ్మ సంబరాలలో భాగంగా ఐదో రోజు ఉక్కు నగరంలోని ఆంధ్ర కేసరి కళా క్షేత్రంలో ఆటపాటా నిర్వహించారు. ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు, పిల్లలు సంప్రదాయ బద్ధంగా ఆట, పాటలతో సందడి చేశారు. తొలుత ఉక్కు జనరల్ మేనేజర్‌లు బాల కుమార్, రవి శేఖర్, ఎస్.వీరేశం, కోటేశ్వరరావు, ఎస్.కుమారస్వామి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. సంఘం అధ్యక్షులు ఎస్.కుమార స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా బతుకమ్మ వేడుకలు ఉక్కు నగరంలో జరగడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.నర్సింగరావు, టి.ప్రభాకర్, ఎంకెవిఆర్ మోహన్‌రావు, ఎం.వేణు గోపాల్, తాండ్ర కనక రాజు, సిహెచ్ రవి కుమార్, వేణుగోపాల్, ఎం.చంద్రశేఖర్, జి.మల్లేశం, శంకర్, చంద్ర కిరణ్, బలరాం, పరమేశ్ పాల్గొన్నారు.

పోర్ట్ గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరించొద్దు

డిప్యూటీ చైర్మన్‌కు యూనియన్ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పోర్ట్ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి చెందిన అన్ని యూనియన్‌లు సంయుక్తంగా సోమవారం చైర్‌పర్సన్ విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి వినతి వినతి పత్రం అందజేశారు. పీపీపీ పద్ధతిలో పోర్ట్ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ యొక్క చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఆగస్టు 7న అథారిటీతో జరిగిన సమావేశంలో పోర్ట్ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీ కరణపై అన్ని యూనియన్లు తమ అసమ్మతిని పీపీపీ విధానంలో వ్యక్తం చేసినప్పటికీ, మినిట్స్‌లో సరిగ్గా నమోదు చేయలేదని, ఆగస్టు 28న కార్యదర్శి లేఖ ద్వారా పంపిణీ చేయబడిందని, అంతేకాకుండా, పైన పేర్కొన్న ప్రైవేటీకరణ కోసం టెండరింగ్ చర్య ప్రక్రియలో ఉందని, దీనిని వీపీటీ యొక్క అన్ని రిజిస్టర్డ్ లేబర్ యూనియన్‌లు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి చెందిన అన్ని రిజిస్టర్డ్ లేబర్ యూనియన్‌లు ఈ క్రింది వాటిని ఏకగ్రీవంగా సమర్పించాయని, పోర్ట్ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, పోర్టు నిధులతో పోర్ట్ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బిసిహెచ్ మసేను, సీఐటీయూ నాయకులు జక్కన్న, సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, సాంబశివరావు, వెంకటే శ్వర్లు, హెచ్ఎంఎస్ నాయకులు మంగయ్య నాయుడు, ఐఎన్‌టీయూసీ నాయకులు చందు, బిఎంఎస్ నాయకులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలీ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన సంగీత్ మధుర్

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారిగా కె.సంగీత్ మధుర్ సోమవారం ఉదయం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను సాయంత్రం తన ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ట్రైనీ డిప్యూటీ కాలెక్టర్ గా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆర్డీఓ కే సంగీత్ మధుర్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా వినతులు నిర్ణీత గడువులోగా పరిష్కారం కావాలి

ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)గా వచ్చే ప్రజా వినతులకు సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని, అవసరమైతే ప్రజలతో నేరుగా మాట్లాడాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేసులు రీ-ఓపెన్ కావడానికి వీలులేదని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత గడువులో ఆడిట్ నిర్వహించుకోవాలని, సమీక్షించుకుని త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్.లో పాల్గొన్న ఆయన వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. కోర్టు కేసులు, పి.జి.ఆర్.ఎస్., ఇంటర్ డిపార్ట్మెంటల్ అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి నిమిషంలో కాకుండా ముందు నుంచే ప్రజా ఫిర్యాదులపై స్పందించాలని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మండల స్థాయి అధికారులు గ్రీవెన్స్ డే నాడు తప్పకుండా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి వినతులు స్వీకరించి మండల స్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. సి.ఎం.ఓ.లో నమోదు అయ్యే ఫిర్యాదులపై కూడా నిర్ణీత కాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వివిధ అంశాలపై 208 ఫిర్యాదులు

సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.)లో ప్రజలు వివిధ సమస్యలపై 208 వినతులు సమర్పించారు. వాటిలో 91 రెవెన్యూవి ఉండగా, జీవీఎంసీకి చెందినవి 73, పోలీస్ విభాగానికి సంబంధించినవి 15, ఇతర శాఖలకు చెందినవి 29 ఉన్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖపట్నం ఆర్డీవో పి.శ్రీలేఖ పాల్గొన్నారు.

సీఐను కలిసిన భీమిలి జనసేన ఇన్‌చార్జి సందీప్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింత వాసునాయుడును భీమిలి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో ఏమైనా సమస్యలను నాయకులు మీ దృష్టికి తీసుకొచ్చి నట్లయితే న్యాయపరంగా సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పల రాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, బూత్ కన్వీనర్ ప్రశాంత్ కుమార్ నాయుడు, రాంపల్లి సురేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

చెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - పద్మనాభం: రేవిడి ప్రధాని రహదారికి ఆనుకొని ఉన్న యానాద్రి చెరువులో సకల వ్యర్థాలు వేస్తున్నారని వేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ రేవిడి ఎంపీటీసీ ఎస్.సూరప్పుడు స్థానిక ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. యానాద్రి చెరువు ఒకప్పుడు స్వచ్ఛమైన నీరుతో ఉండేదని, గత కొన్నేళ్ళుగా చుట్టుపక్కల గ్రామస్తులు ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహ నిర్మాణ వ్యర్థాలు, పాత బట్టల వ్యర్థాలు, ఇతర ఇతర వ్యర్థాలు వేస్తున్నారని, అలాగే రేవిడి, మజ్జివలసలో మాంసం విక్రయదారులు విపరీతంగా కళేబరాలను, జీవ వ్యర్థాలను ఆ చెరువులో పడేయడం వల్ల చెరువు కలుషితం అవటమే కాకుండా ఒక్కోసారి రోడ్డు పక్కన పడేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కుక్కలు వచ్చి ఆ వ్యర్థాలను తిని, మళ్లీ తిరిగి రోడ్డు మీదకు వేస్తున్నాయని అన్నారు. అధికారులు యానాద్రి చెరువుపై దృష్టి పెట్టి రోడ్డు ప్రక్క ఎటువంటి సకల వ్యర్థాలు వేయకుండా హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు.

వాసు హత్యకు ఆస్తి తగాదాలే కారణం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం శెట్టిబలిజ వీధిలో ఇటీవల వాసు అనే యువకుడు హత్యకు ఆస్తి తగాదాలే కారణమని సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఆస్తి తగాదాలో వాసు అన్నయ్య కుమారుడైన పవన్ సాయిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ కేసును చేదించడంలో సహకరించిన పోలీసులందరికీ అభినందనలు తెలిపారు. నిందితుడ్ని స్థానిక సాగర్ దుర్గా ఆలయం వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందని నిందితున్ని రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు.

బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించవద్దని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ హితవుపలికారు. బాల్య వివాహాల చట్టం -2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు ఆడ పిల్లలకు, 21 సంవత్సరాల లోపు మగ పిల్లలకు వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా, హాజరైనా నిందితులే అవుతారని హెచ్చరించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన పి.జి.ఆర్.ఎస్.లో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ జయదేవిలతో కలిసి బాల్య వివాహాలపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయని, వాటిని ఎవరూ ప్రోత్సహహించవద్దని హితవు పలికారు. ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటుందని, నాన్ బెయిల్ బుల్ కేసు పెడతారని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పిడీ జయదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు

- స్ట్రోక్ యూనిట్ ద్వారా ఉచితంగా రూ.55 వేలు ఇంజక్షన్

- విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

విశాలాంధ్ర - విశాఖపట్నం: విమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, స్ట్రోక్ యూనిట్ ద్వారా హార్ట్ స్ట్రోకు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి రూ.55 వేలు విలువచేసే ఇంజక్షన్ ఉచితంగా చేస్తున్నట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే.రాంబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరిలోవ ప్రాంతానికి చెందిన జగన్నాధరావు (70) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో ఒక్కసారిగా పక్షవాతంతో కుప్పకూలిపోయారని, నిరుపేద కుటుంబానికి చెందినటువంటి జగన్నాధరావును నేరుగా విమ్స్ ఆస్పత్రికి తీసుకొని వచ్చారన్నారు. న్యూరో మెడిసిన్ వైద్యులు ఆ రోగిని పరీక్షించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ స్ట్రోక్ కు గురైనట్లు గుర్తించామని, దీంతో ఆయన కోలుకోవడానికి 55 వేల రూపాయలు విలువ చేసిన ఇంజక్షన్ అందించి ఆరోగ్యం కుదుట పడేలా చేశారన్నారు. దీంతో వారం రోజుల్లోనే పూర్తిగా కోల్కొని డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లారని, ఇలా అనేక అత్యాధునిక వైద్య సేవల కు విమ్స్ ఆసుపత్రి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని, విమ్స్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవల వివరాలను వివరించారు.

మూడు గంటల గోల్డెన్ అవర్

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కుప్పకూలిపోయిన వారికి గోల్డెన్ అవర్‌గా మూడు గంటల సమయం ఉంటుందన్నారు. ఆ సమయం లోపల రోగికి సిటీ స్కాన్ నిర్వహించి ఇంజక్షన్ చేయటం వలన ప్రాణాపాయం నుంచి కోల్కొని ఆరోగ్యవంతులు కావచ్చు అన్నారు.

ఆరు నెలలలో 1016 ఎండోస్కోపీలు

ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రిలో మూడు వేల నుంచి 30 వేల వరకు ఉండే ఎండోస్కోపీ, కొలమస్కోపి, ఈఆర్‌సిపి ఎండో అల్ట్రా సోనోగ్రఫీలు విమ్స్ ఆసుపత్రి నందు ఉచితంగా రోగులకు చేయటం జరుగుతుం దన్నారు. గడిచిన ఆరు నెలల్లో 1016 ఎండోస్కోపీలను ఉచితంగా నిర్వహించడం జరిగిందన్నారు.

ఎండోస్కోపిక్ ద్వారా న్యూరో సర్జరీలు

రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో లేని విధంగా ఎండోస్కోపిక్ ద్వారా న్యూరో సర్జరీ శస్త్ర చికిత్సలను విమ్స్ ఆస్పత్రిలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ వైద్య సేవలను ఉత్తరాంధ్ర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

జగన్ చేసిన తప్పిదాలను చక్కదిద్దే పనిలో చంద్రబాబు సర్కార్

విశాలాంధ్ర - భీమిలి: వాలంటీర్లు, మద్యం దుకాణాల్లో పనిచేసే వారిని జగన్ రెడ్డి ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో ప్రజలు గుర్తించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. వాలంటీర్లను జగన్ రెడ్డి ఏ విధంగా మోసం చేశారో తెలిస్తే ఆశ్చర్య పోవలిసిందేనని అన్నారు. వాలంటీర్ వ్యవస్థకు చట్టభద్దత లేదని వారు ప్రభుత్వ ఉద్యోగులు కాదని జగన్ రెడ్డి చెప్పిన మాటను మర్చిపోకూడదని అన్నారు. వారికి జీతాలు ప్రభుత్వం ఇవ్వడం లేదని కాంట్రాక్ట్ పద్దతిన థర్డ్ పార్టీ సంస్థ జీతాలు ఇస్తుందని అన్నారు. గత ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను రెన్యూవల్ చేయలేదని దీని ప్రకారం జగన్ ప్రభుత్వమే వీరిని తొలగించిందని ఈ విషయం గమనించాలని అన్నారు. రాష్ట్రంలో 2,50,000 వాలంటీర్లు ఉంటే 2024 సాధారణ ఎన్నికల సమయంలో వైసిపీ నాయకుల బలవంతం కారణంగా సుమారుగా ఒక లక్ష మందితో రాజీనామాలు చేయించారని ఈ విషయం ప్రజలందరూ గుర్తించాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు.

ఆనందపురంలో వారాహి దేవి అనుగ్రహ పీఠం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని ఆనందపురం పంచాయతీ పరిధిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో సోమవారం శ్రీ వారాహి దేవి అనుగ్రహ పీఠం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విజయవాడ నుండి గురువు శ్రీ గణేశానంద స్వామి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ గణేశానంద స్వామి మాట్లాడుతూ వారానికి రెండు రోజులపాటు అమ్మవారిని ధ్యానం చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. విజయవాడ హైదరాబాద్ తర్వాత అనందపురంలో భక్తులు వెన్ని అప్పలరాజు కోరిక మేరకు ఈ పీఠాన్ని ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం శివాలయం పురోహితులు రాంబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చీమలాపల్లిలో వేదమాతను దర్శించుకున్న ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో గల శ్రీ వేదమాత గాయత్రి అమ్మవారి ఆలయంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రో త్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకార రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు అమ్మవారిని దర్శించుకొని విశేష అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థా పకులు కెంగం రామకృష్ణ స్వామి, మాజీ ఎంపీటీసీ అయిత యెర్రయ్య, వైసిపి నాయకులు ఆకుల గుణాకర్, కంచిబోయిన వెంకట సంతోష్, దువ్వి అప్పారావు, అయిత అప్పలరాజు, బొట్ట కృష్ణ, బొడ్డ దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలను గీత కార్మికులకు ఉచితంగా కేటాయించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రభుత్వ మద్యం దుకాణాలను కల్లు గీత కార్మికులకు ఉచితంగా కేటాయించాలని ఆ సంఘం ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెందుర్తి మండలం నరవ గ్రామంలో గీత కార్మికుల ఎనిమిదో మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన ఏపీ కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షులుగా పోలయ్య, కార్యదర్శి జిత్తుక సంతోష్, ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ, సహాయ కార్యదర్శి దమ్ము నరసింహులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎటువంటి టెండర్ ప్రక్రియ లేకుండా గీత కార్మికులకు ఉచితంగా మద్యం దుకాణాలు ఇవ్వాలని కోరారు. రియల్ ఎస్టేట్ కారణంగా చెట్లు నరికేయడంతో గీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మద్యం క్వార్టర్ ధర 99 రూపాయలు కావడంతో కల్లును ఎవరూ తాగడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తమను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

మధురవాడ పీఏసీఎస్ మహాజన సభ

విశాలాంధ్ర - కొమ్మాది: గడిచిన ఆర్థిక సంవత్సరంలో మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 38 లక్షల 60 వేల రూపాయలు లాబాలు ఆర్జించిందని పిఏసిఎస్ ఆఫీసియల్ పర్సన్ ఇన్‌చార్జ్ ఎం.రమేష్ బాబు తెలిపారు. సోమవారం 65వ మహాజన సభ సంఘం ఆవరణలో జరిగింది. ఈ సభలో అయన మాట్లాడుతూ సంఘంలో లాకర్లు కొనుగోలు చెయ్యాడానికి కృషి జరుగుతున్నదని ఇటీవల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించిన జన ఔషద కేంద్రం నుండి తక్కువ ధరలకు ఈ ప్రాంత ప్రజలు మందులు కొనుగోలు చేసుకోవాలని కోరారు. ఈ సభలో సంఘం సిఇఓ ఎం.అప్పలరాజు, మాజీ ఉపాధ్యక్షుడు మరుపిల్ల పైడిరాజు, సభ్యులు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, నాగోతి సూర్యప్రకాష్, పోతిన శ్రీనివాసరావు, కుడితి రామారావు, నమ్మి నరసింహులు, దుర్గాసి రాము పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఇత్తిహాద్ ముస్లిం కమ్యూనిటీ, హుస్సేన్ ట్రస్ట్ సంయుక్తంగా విశాఖ అపోలో హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం వన్‌టౌన్ పాత పోస్ట్ ఆఫీస్ సమీపంలో వున్న మెహదీ బిల్డింగ్ వద్ద నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో బిపి, ఆర్‌బిఎస్, ఈసీజీ, కంటి పరీక్షలు, యూరిక్ యాసిడ్, బిఎండి తదితర పరీక్షలు అపోలో హాస్పిటల్ ప్రముఖ వైద్యులు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ వైద్య నిపుణుల పర్యవేక్షణలో సుమారు 111 మంది వైద్య సేవలు పొందారు. ప్రముఖ ఎముకల వైద్యులు డా అబ్దుల్ డి.ఖాన్, పిల్లల వైద్య నిపుణులు డా ఫజలా, దంత వైద్యులు మెగా ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన వారికి సేవలు అందజేశారు. ఇత్తిహాద్ ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షులు ఐహెచ్ ఫరూకి అధ్యక్షతన జరిగిన ఈ మెగా వైద్య శిబిరానికి ప్రముఖ వ్యాపార వేత్త హమీద్ అలీ ఖాన్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ సెక్రటరీ జాఫర్ హుసైన్, ముస మెహిది, సుఖిభవ డైరెక్టర్ హాజీ మీర్ అబ్బాస్ హుసైన్ తదితరులు పాల్గొని వారి సహాయ సహకారం అందజేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కొవ్వాడ గ్రామం వెళుతున్న 222కె ఆర్టీసీ బస్సు అనంతవరం గ్రామం వద్ద పైడితల్లమ్మ గుడి దగ్గర రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న దేవరాపల్లి కన్నమ్మ (78) ఆర్టీసీ బస్సు గుడి దగ్గరలో మలుపు తిరుగుతున్న సమయంలో ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె బస్సు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మరణించారని పోలీసు వారు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

నేటి నుంచి నోవెటాల్‌లో సూత్ర ప్రత్యేక ప్రదర్శన

విశాలాంధ్ర- విశాఖపట్నం : సూత్ర ఎగ్జిబిషన్ వైజాగ్‌లోని నోవాటెల్ హోటల్ నందు అక్టోబర్ 8, 9 తేదీలలో ప్రదర్శనను ప్రారంభించినట్లు ప్రకటించింది. దసరా దీపావళి పండగల కోసం ప్రత్యేక వస్త్రాలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెప్పారు. మహిళల దుస్తులు, సాంప్రదాయ దుస్తులు, ఫ్యూజన్ దుస్తులు, ఉపకరణాలు, నగలు, బ్యాగ్‌లు, గృహాలంకరణ, జీవనశైలి వస్తువులు గిఫ్ట్ మొదలైన ఎన్నో రకాల ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంటాయన్నారు. సూత్ర ప్రదర్శనలో దుస్తులు, గౌన్లు, చీరలు, పాదరక్షలు, ఉపకరణాలు తోపాటుగా డిజైనర్ ఉత్పత్తుల విస్తృత శ్రేణిని ప్రదర్శిస్తారు. దేశంలోని వివిధ పప్రదేశాల నుండి 40 మందికి పైగా ఎగ్జిబిటర్లు తమ ప్రత్యేక ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఫ్యాషన్ జైపూర్, లక్నోవీ కుర్తీస్ ప్లాజో, పండోర ఆర్ట్ జ్యుయలరీ, ఓం కలెక్షన్స్, కలర్స్ ఫ్యాబ్ కోల్ కతా, క్రియేటివ్ హబ్ డిల్లీ, వార్డ్ రోబ్, శ్రీగణేష్ బొటిక్, మహాలక్ష్మి జ్యుయలరీ, లక్ష్మో హెూమ్ ఫ్యాబ్రిక్స్ తదితర వెరైటీలు అందుబాటులో ఉంటాయన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - పద్మనాభం: బాందేపురం గ్రామానికి చెందిన బోనెల సింహాద్రి (41) పురుగులు మందు తాగడంతో కుటుంబ సభ్యులు అతన్ని విజయనగరం జిల్లా ఎంఆర్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లి చికిత్స చేయించారు. అయితే సోమవారం ఉదయం నాలుగు గంటల సమయంలో చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసు వారు తెలియజేశారు. ఇతను కుమార్తె నాలుగు నెలల క్రితం పాముకాటుకు గురై మరణించడం వల్ల ఆ బాధతో మనస్థాపానికి గురై తాగుడికి బానిసై పురుగుల మందు తాగినట్లు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవ్ ఎక్సెలరేటర్ డిఆర్‌హెచ్‌పీ దాఖలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఐపిఓ ద్వారా నిధులను సేకరించేందుకు దేవ్ ఎక్సెలరేటర్ లిమిటెడ్ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డి ఆర్ హెచ్ పి)ని మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్సేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)కి దాఖలు చేసింది. దేవ్ ఎక్సెలరేటర్ లిమిటెడ్ ఉమేష్ ఉత్తమ్‌చందానీ, పార్త్ షా, రుషిత్ షా దేవ్ ఇనార్మేషన్ టెక్నాలజీ లిమిటెడ్ ద్వారా ప్రమోట్ చేయబడింది. డెవ్‌ఎక్స్ అనేది టైర్ 2 మార్కెట్‌లలో ఆపరేషనల్ ఫ్లెక్స్ స్టాక్ పరంగా 6 నగరాల్లో కేంద్రాలను కలిగి ఉన్న అతిపెద్ద మేనేజ్డ్ స్పేస్ ఆపరేటర్‌లలో ఒకటి. ఆగస్టు 31, 2024 నాటికి, కంపెనీ 230 మంది క్లయింట్‌లకు సేవలు అందించింది మరియు భారతదేశంలోని 11 నగరాల్లో 25 కేంద్రాలను కలిగి ఉంది. దేవ్ ఎక్సెలరేటర్ డి ఆర్ హెచ్‌కి పాంటోమత్ క్యాపిటల్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనేది ఇష్యూకు ఏకైక బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాయి.

వార్డుల్లో తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: దక్షిణ నియోజకవర్గంలో జీవీఎంసీ జోన్ 4 పరిధిలో 33, 35వ వార్డుల్లో తారు రోడ్ల నిర్మాణం చేపట్టుటకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. 33వ వార్డ్‌లో అల్లిపురం, వివేకానంద కాలనీ, కుమ్మరి వీధులలో 39.72 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం కొరకు అదేవిధంగా 35 వార్డ్ డాల్ఫిన్ హెూటల్ నుండి, పెట్రోల్ బంక్ కాలనీ, కుమ్మరి వీధులలో 41 లక్షలు, రామకృష్ణ రైతు బజార్ నుండి ఫిష్ మార్కెట్ వరకు 43 లక్షలు, ఫిష్ మార్కెట్ నుండి సీ హార్స్ జంక్షన్ వరకు 42 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం కొరకు శంకుస్థాపన చేశారు. దక్షిణం లో త్వరలో మరెన్నో అభివ ృద్ధి పనులు చేపడతామని ఈ సందతరేగా తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సౌత్ ఇన్చార్జి సుధాకర్ 33 వార్డ్ కార్పొరేటర్ , ఫ్లోర్ లీడర్ శ్రీమతి వసంత లక్ష్మి, 35 వార్డ్ కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ విల్లూరి భాస్కర రావు , జోన్ 4 కమిషనర్ నాయుడు , ఏ. ఇ సమీమ్ , టీడీపీ, బిజెపి, జనసేన పెద్దలు పాల్గొన్నారు..

మధురవాడలో సంత తరలించవద్దని ధర్నా

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడలో తరతరాలుగా నిర్వహిస్తున్న సంతను తరలించి చిల్లర వర్తకులకు అన్యాయం చేయవద్దని సంత వర్తకులు కోరారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం సంత నిర్వాహకులు ధర్నా నిర్వహించారు. మధురవాడలో వారాంతపు సంతను తరలించి మా పొట్టలు కొట్టి అన్యాయం చేయవద్దని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ గత రెండు వారాలుగా సంత వర్తకులను ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ జోనల్ 2 కమిషనర్ అడ్డుకుని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇది అన్యాయమని ప్రశ్నిస్తే, సంతను వేరే చోటకు తరలిస్తామని చెబుతున్నారని అన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతుందని, కాబట్టి వెళ్లిపోవాలని దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. సంత నిర్వాహకులు ఊరూరా తిరిగి సరుకులు అమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద వారని అన్నారు. ఇందులో ఎక్కువగా కుటుంబ భారాన్ని మోసే మహిళలు, ఒంటరి మహిళలు, వికలాంగులు, వితంతువులు ఉన్నారని తెలిపారు. ఇటువంటి వారికి అండగా ఉండవలసిన అధికారులు దాడులు చేశారని, ఇది చాలా అన్యాయమని అన్నారు. అనంతరం సంఘ పెద్దలు, యూనియన్‌ల నాయకులు కలెక్టరుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.రాజ్ కుమార్, డి.అప్పలరాజు, డి.కొండమ్మ, జి.కిరణ్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.లక్ష్మి, వెంకటేశ్వరరావు, అరుణ, సంత సంఘం నాయకులు టి.అప్పారావు, కే.లలిత, వి.వెంకటరావు, ఎస్ కే ఫాతిమా, పి.పైడికొండ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ కేంద్రంగా ఏచూరి స్మారక భవనం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రజా ఉద్యమ కేంద్రంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయం కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మారక భవనం పేరుతో నిర్మించడం చాలా అభినందనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. మద్దిలపాలెం కళాభారతి వద్ద ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయం నిర్మాణ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భవన స్థలంలో ఇటుక సిమెంటు వేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ జిల్లా ఉద్యమంతో సీతారాం ఏచూరికి అనుబంధం ఉందన్నారు. విశాఖ జిల్లాలో ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటుపరం కాకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగేందుకు ఏచూరి కీలక పాత్ర పోషించా రన్నారు. 2015 విశాఖ జిల్లాలో జరిగిన సిపిఐఎం అఖిలభారత మహాసభలలో సీతారాం ఏచూరి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక య్యారని గుర్తు చేశారు. అందుకు ఆయన పేరుతో దేశంలోనే మొట్టమొదట కార్యాలయంగా విశాఖ జిల్లా కార్యాలయమే అవుతుందని, దీనికి రాష్ట్ర కమిటీ అభినందనలు తెలియజేస్తుందన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్ నర్సింగరావు, ఎంవిఎస్ శర్మ, వీఎస్ పద్మనాభ రాజులు మాట్లాడుతూ విశాఖ జిల్లా కార్మిక వర్గ ఉద్యమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం సిపిఎం జాతీయ నాయకులు అనేకమంది కృషి చేస్తున్నారని, సిపిఎం లోక్ సభ, రాజ్యసభ సభ్యులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం ఎత్తుతున్నారన్నారు. విశాఖపట్నం కార్పొరేషన్‌లో సిపిఎం కార్పొరేటర్‌గా డాక్టర్ బి.గంగారావు ఒక్కరే ఉన్నప్పటికీ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలను ఐక్యం చేయడం లోనూ, కార్పొరేషన్ కౌన్సిల్లో ఎజెండా పెట్టించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు అధ్యక్షత వహించిన ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్ఐ సేవలు

ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్ఐ (ఆంధ్రప్రదేశ్ సాధారణ జీవిత భీమా) సేవలను పొందాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎ.పి.జి.ఎల్.ఐ సంయుక్త సంచాలకులు ఎం. ఝాన్సీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీజీఎల్ఐ జీవిత బీమా సేవలు అందిస్తోందని గుర్తు చేశారు. దానిలో భాగంగా మే నెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎ.పి.జి.ఎల్.ఐ సేవలు ఆఫ్ లైన్ నుంచి నిధి పోర్టల్‌కు బదలాయింపు జరిగాయని, ఈ విషయాన్ని పాలసీదారులు గుర్తించి సేవలను ఆన్లైన్ లోనే పొందాలని సూచించారు. మే 24 నుంచి నేటి వరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో గల ఎ.పి.జి.ఎల్.ఐ పాలసీదారులకు చెందిన 1,368 పరిణితి, మరణ క్లైములు, 503 ఎలీలిణ దరఖాస్తులను ఆమోదించి వారి డీడీవోల నిధి పోర్టల్ లాగిన్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. డిడిఓలు నిధి పోర్టల్ లాగిన్‌కు వచ్చిన ఆమోదిత క్లెయిమ్ లు, రుణ చెల్లింపుల కొరకు సిఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లు జనరేట్ చేసి, సబ్మిట్ చేయవలసి ఉందని ప్రకటనలో స్పష్టం చేశారు. అదేవిధంగా ఉద్యోగి బేసిక్ పే స్లాబ్ రేట్ ప్రకారం మొదటి పాలసీ బాండ్ ను వారి కార్యాలయ డీడీవో నిధి లాగిన్ లో మాత్రమే జనరేట్ చేయాలని వారి ప్రీమియంను మొదట నెల జీతం బిల్లులో రికవరీ పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. పాలసీదారులకు వారి నిధి పోర్టల్ లాగిన్‌లో బేసిక్ పేలో 15% వరకు స్వచ్ఛందంగా పెంచుకొనే సౌలభ్యం ఉందని తెలిపారు. అలాగే ఏపీజీఎల్ఐ కార్యాలయం త్వరలోనే జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమర్షియల్ కాంప్లెక్స్ భవనానికి మారనుందని పేర్కొన్నారు.

జివిఎంసి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 వినతులు

- జివిఎంసి అదనపు కమీషనరు ఎస్.ఎస్.వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 75 వినతులు వచ్చాయని, వాటిని పరిశీలించి వెంటనే పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ అదనపు కమీషనరు ఎస్.ఎస్.వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు హాజరైన అన్ని విభాగాల అధికారులతో అదనపు కమీషనరు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో ప్రజల నుండి స్వీకరించిన వినతులు, ఫిర్యాదులపై వారి వారి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పి జి ఆర్ ఎస్ పై కోఆర్డినేటింగ్ మీటింగ్ నిర్వహించి సోమవారం అధికారులందరికీ ఆదేశించారన్నారు. ఈ విషయమై ప్రతి సోమవారం జీవీఎంసీ నిర్వహిస్తున్న ప్రజా సమస్య ల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజా వినతులు/ ఫిర్యాదులపై వెంటనే సంబంధిత అధికారులు ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని, అలా కానీ ఎడల ప్రతి వారం పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదులు ఎక్కువవుతాయని కలెక్టర్ ఆదేశించారన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో అధికారులు ప్రజల వినతుల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అనంతరం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి 75 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 02, 2వ జోన్ కు 11, 3వ జోన్ కు 17, 4వ జోన్ కు 07, 5వ జోన్ కు 12, 6వ జోనుకు 11, 8వ జోన్ కు 04, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ %డ% అకౌంట్సు విభాగమునకు 02, రెవెన్యూ విభాగమునకు 10, ప్రజారోగ్య విభాగమునకు 05, పట్టణ ప్రణాళిక విభాగమునకు 38, ఇంజినీరింగు విభాగమునకు 13, ఉద్యాన వనం విభాగమునకు 02, యు.సి.డి విభాగానికి 05 కలిపి మొత్తంగా 75 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను నిరీ?త సమయంలో పరిష్కరించాలని అదనపు కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకరరావు, డిసి(రెవెన్యూ) శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం.దామోదరరావు, కార్యదర్శి బివి రమణ,ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి, ఎఫ్.ఎ%డ%ఎ.ఓ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీర్లు గోవిందరావు, శాంసన్ రాజు, రామమోహనరావు, సిటీ ప్లానర్ మీనా కుమారి, సంపత్ కుమార్, డిపిఓ చంద్రిక, యుసిడి పి.ఓ డి.లక్ష్మి, డీసీపీ పద్మజ, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎన్. కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి, ఆర్.ఎఫ్.ఓ హనుమంతరావు , డిప్యూటీ తాసిల్దార్ రమా తదితరులు పాల్గొన్నారు.

శారదా పీఠం వ్యవహారంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎన్.హరేందర్ ప్రసాద్‌కు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఫిర్యాదు

విశాలాంధ్ర- విశాఖపట్నం: హిందూ వాదినని శారదా పీఠాధిపతిని అంటూ ప్రజలను మోసం చేస్తూ స్వరూపానందేంద్ర సరస్వతి పేరుతో చలామణి అవుతున్న ఎస్.ఎస్.పాల్ అక్రమాలు అన్నీ ఇన్నీ కావని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎన్.హరేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. శారదా పీఠం పేరుతో ఎస్.ఎస్.పాల్ భూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. శారదా పీఠం ప్రవేశ ద్వారం ఎదుట ఉన్న పబ్లిక్ రోడ్డును తన ఆధీనంలోకి తీసుకున్నారన్నారు. ఫలితంగా ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. మరోవైపు శారదా పీఠం గోశాలను గెడ్డ స్థలంలో నిర్మించారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారాల పై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్.ఎస్.పాల్ (స్వరూపానందేంద్ర సరస్వతి) వైసీపీ ప్రభుత్వానికి తొత్తుగా మారి ఇష్టనుసారంగా వ్యవహరించారన్నారు. ఈ క్రమంలోనే భీమిలిలో 15 ఎకరాల భూమి కూడా సొంతం చేసుకున్నారని ప్రస్తావించారు.